సాక్షి
ములుగు
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



ఫోన్ పోయిందంటే..
మొబైల్ ఫోన్ పోయిందంటే చాలు.. యూపీఐ వ్యాలెట్ల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు మాయం చేస్తున్నారు.
- 8లో



మేడారంలో విద్యుత్ పనులు షురూ
మేడారం సమ్మక్క సారలమ్మ మహాజాతరను పురస్కరించుకొని విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి.
- 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 27.0°/14.0°
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామప్పను దర్శించిన విదేశీయులు



వెంకటాపురం(ఎం) : మండలంలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని అమెరికాకు చెందిన పర్యాటకులు డాన్, విట్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు రామలింగేశ్వరుడిని దర్శించుకోగా ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టతను స్టేట్ టూరిజం గైడ్ కుమార్, స్థానిక గైడ్ విజయ్‌కుమార్ వివరించారు. రామప్ప శిల్పకళ సంపద అద్భుతమని వారు కొనియాడారు. అదేవిధంగా వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు, విద్యార్థులు తరలివచ్చి రామలింగేశ్వర స్వామికి పూజలు చేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి



ములుగు రూరల్ :దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని టీబీ, లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ జిల్లా అధికారి పోరిక రవీందర్ అన్నారు. మండల పరిధిలోని మల్లంపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సోమవారం తనిఖీ చేశారు. ఆరోగ్య ఉప కేంద్రంలో క్షయ అనుమానితులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం మహ్మద్‌గౌస్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పిల్లలకు అందించే పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో దగ్గు, జలుబుతో ఇబ్బంది పడుతున్న చిన్నారులను పరీక్షించి మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీలకు అవకాశం ఇవ్వాలి



ఏటూరునాగారం : మండలంలోని కొండాయి గ్రామపంచాయతీ వార్డు సభ్యులుగా బీసీ, ఎస్సీలకు అవకాశం ఇవ్వాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పరికి ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు పరికి భిక్షపతి, శ్రీనివాస్ కోరారు. సోమవారం ములుగు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండాయి పంచాయతీలో 1962 నుంచి 2018 వరకు ఎస్సీ రిజర్వుకు రెండు వార్డులు కేటాయించారని తెలిపారు. పాత పద్ధతిలోనే మళ్లీ వార్డులు ఉండే విధంగా చూడాలన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటు సేవాదృక్పథం అలవర్చుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవాపథకం(ఎన్‌ఎస్‌ఎస్) కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ అన్నారు. కేయూ ఫార్మసీ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలతో వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని అన్నారు. అంతకు ముందు క్యాంపస్‌లోని ఆడిటోరియం ప్రాంతంలో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, డీన్ ప్రొఫెసర్ వై.నర్సింహారెడ్డి, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య, ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్లు కృష్ణవేణి, స్వరూపరాణి, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫుల్‌టైం మెడికల్ ఆఫీసర్(మేల్) నియామకానికి ఎంబీబీఎస్ అర్హత, మంచి వ్యక్తిత్వం, సేవాదృక్పథం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈమేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు బయోడేటా, సర్టిఫికెట్ల ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు. బోధన, బోధనేతర సిబ్బందికి, విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు అందించాల్సి ఉంటుందని వివరించారు.

వినతుల పరిష్కారమేదీ?

గ్రీవెన్స్‌కు 20 అర్జీలు
- స్వీకరించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్
- అధికారుల తీరుతో ఆసక్తి చూపని ప్రజలు



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్



గిరిజన దర్బార్‌లో పీఓ అంకిత్‌కు వినతులు సమర్పిస్తున్న గిరిజనులు

ములుగు: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు అంతంత మాత్రమే వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ స్వీకరించారు. గతంతో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణికి మొత్తంగా 20 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలకు సంబంధించి 9, పెన్షన్లు అందించాలని 2, ఇతరత్రా సమస్యలపై మరో తొమ్మిది మంది అర్జీలు పెట్టుకున్నారు. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని చెబుతున్న అధికారులు జాప్యం చేయడంతో ప్రజలు ప్రజావాణిపై ఆసక్తి చూపని పరిస్థితి నెలకొంది. ఇదే క్రమంలో జిల్లా కేంద్రంలోని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు సోమవారం పలు సమస్యలపై సుమారు 30 దరఖాస్తులు అందడం గమనార్హం. కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించిన అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులతో మాట్లాడారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా సమస్యలను పరిష్కరించాలన్నారు. వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు అందించారు. గ్రీవెన్స్ వినతులు పెండింగ్‌లో ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, పశు సంవర్ధక శాఖ అధికారి విజయభాస్కర్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై వచ్చిన వినతులు ఇలా..

ఇసుక క్వారీ మంజూరు చేయాలి



ఏటూరునాగారం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన శ్రీరామా ఇసుక క్వారీ -2ను అర్హులైన వారికి కేటాయించాలి. శ్రీరామా ట్రైబల్ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు కో ఆపరేటీవ్ సహకార సొసైటీలో 177 మంది సభ్యత్వం కలిగి ఉన్నాం. గ్రామం పక్క నుంచే గోదావరి ప్రవహిస్తున్నా తమకు ఇసుక క్వారీ నిర్వహణకు హక్కు కల్పించడం లేదు. ఈ విషయంలో ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, జియాలజీ, ఏడీ మైన్స్ అధికారులకు వినతులు అందిస్తున్నాం.

- కోడి ధర్మరాజు, రామన్న గూడెం

గిరిజనుల అభివృద్ధికి పాటుపడాలి



5వ షెడ్యూల్డ్ పరిధిలోని గిరిజనుల అభివృద్ధికి ఐటీడీఏ, జిల్లా యంత్రాంగం తరపున సహకరించి ఇసుక క్వారీని మంజూరు చేయాలి. ఆకులవారి గణపురంలో సుమారు 200మంది కోయ నాయకపోడు ఆదివాసీ గిరిజనులము ఉన్నాము. శ్రీ రాజరాజేశ్వరి ట్రైబల్ ఇసుక క్వారీ లేబర్ కాంట్రాక్టు లిమిటెడ్ పేరుతో నిబంధనల పేరుకు రిజిస్ట్రేషన్ చేసుకున్నాము. ఇసుక క్వారీకి అనుమతి ఇస్తే ఆర్థికంగా అండగా ఉంటుంది. జిల్లా కలెక్టర్ స్పందించి సొసైటీకి క్వారీని మంజూరు చేయాలి.

- ఈసం రాజు, ఆకులవారి గణపురం

భూమిపై హక్కు కల్పించాలి



ఏటూరునాగారం మండలం మానసపల్లి శివారులో సర్వే నంబర్ 2లో మా తండ్రి పేరుపై 11-16 గుంటల భూమి ఉంది. 1995లో ఈ భూమిని కొనుగోలు చేశాము,. అనంతరం మా తండ్రి మరణించాడు. అప్పటి నుంచి ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాము. 1986లో వచ్చిన గోదావరి వరదల్లో పట్టా పాసు పుస్తకాలు పోయాయి. వారసత్వంగా గత రికార్డుల ఆధారంగా నా పేరుపై భూమిని పట్టా చేయాలి.

- గాదె రమేష్, ఏటూరునాగారం

పింఛన్ అందించాలి



ప్రస్తుతం నాకు 60 సంవత్సరాలు. గతంలో మూడు సార్లు మండల అధికారులతో పాటు జిల్లా అధికారులకు పింఛన్ మంజూరు విషయంపై దరఖాస్తు చేసుకున్నాను. అయినా ఇప్పటి వరకు పింఛన్ రావడం లేదు. ప్రస్తుతం నాకు ఎలాంటి ఆదాయ వనరులు లేవు. ఉన్నతాధికారులను అడిగితే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాలని చెబుతున్నారు. ఎన్ని సార్లు విన్నవించుకున్నా పింఛన్ రావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలి.

- అప్మాదీ బేగం, ములుగు

గిరిజన దర్బార్‌లో 12 వినతులు

ఏటూరునాగారం: గిరిజనుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ సెక్టార్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీఓ అంకిత్ గిరిజనుల నుంచి 12 వినతులు స్వీకరించారు. అవి ఇలా ఉన్నాయి...మంగపేట మండలం ఓడగూడేనికి చెందిన మల్లయ్య, రాంబాబులు పెసా గ్రామసభను నిర్వహించాలని కోరారు. తాడ్వాయి మండలం పడిగాపూర్ గ్రామానికి చెందిన మైత శ్రీను తనకు ట్రైబల్ రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించాలని వేడుకున్నారు. ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురంకు చెందిన గొర్ల బాలస్వామి తన తండ్రి సంతోష్ ఐటీడీఏ పీఓ వద్ద అటెండర్‌గా పనిచేస్తూ మరణించారని తనకు ఏదైనా డ్రైవర్ ఉద్యోగం ఇప్పించాలని విన్నవించారు. తాడ్వాయి మండలం కామారం గ్రామానికి చెందిన గొంది అరవింద్ కుమార్ తన తండ్రి నాగయ్యకు కిడ్నీ, ఊపిరితిత్తులు పాడైపోయాయని ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం ఇప్పించాలని మొరపెట్టుకున్నారు. మంగపేట మండలం రాజుపేటకు చెందిన కుర్సం వెంకటేశ్వర్లు, శివశంకర్, లక్ష్మినర్సయ్య, దుబ్బాక కృష్ణకుమారి, ముత్తయ్యలు గ్రామసభ నిర్వహించాలని వినతి పత్రాన్ని సమర్పించారు. అదే విధంగా కొత్తగూడెం గ్రామానికి చెందిన మోహన్‌రావు, సత్యవతి, శిరీష, శ్రీ ఆంజనేయ ట్రైబల్ ఇసుక, మొరం క్వారీ కోసం పెసా గ్రామసభలు నిర్వహించాలని పీఓను కోరారు. తనకు ఉపాధి, ఉద్యోగం కల్పించాలని వాజేడు మండలం క్రిష్టాపురం గ్రామానికి చెందిన పూనెం సరస్వతి, మౌనిక వినతి పత్రం అందజేశారు. గోవిందరావుపేట మండలం ఇప్పలగడ్డకు చెందిన పూనెం దివ్యజ్యోతి తనకు ఐపీఎస్ కోచింగ్ ఇప్పించాలని వేడుకున్నారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన పూనెం పూజిత ఉన్నతమైన చదువుల కోసం ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరారు. తాడ్వాయి మండలం కొడిశాలకు చెందిన మంకిడి జగన్ మిషన్ భగీరథలో వాటర్‌మ్యాన్‌గా ఉద్యోగం ఇప్పించాలని కోరారు. మేడారంలోని మ్యూజియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ గిరిజన దర్బార్‌లో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఎస్‌ఓ రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రుణం రావడం లేదు..



2021 సంవత్సరంలో ఎకనామికల్ సపోర్ట్ స్కీం కింద రుణం కోసం దరఖాస్తు పెట్టుకున్నా. రుణం మంజూరు అయ్యింది. కానీ ఇంత వరకు బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడలేదు. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రీవెన్స్‌లో వినతులు సమర్పిస్తున్నా. ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు.

- మొర్రి శంకరమ్మ, వెంకటాపురం(కె)

ఎన్ని దరఖాస్తులు ఇచ్చినా..



ఎకనామికల్ సపోర్ట్ స్కీ కింద రుణం రావడం లేదని 8 పర్యాయాలు అధికారులకు దరఖాస్తులు ఇచ్చి సమస్య పరిష్కరించాలని వేడుకున్నాను. అయినా ఇంత వరకు రాలేదు. అధికారుల చుట్టూ, బ్యాంకుల వద్దకు వెళ్లి అడిగితే రాలేదని చెబుతున్నారు. కిరాణం షాపు పెట్టుకొని నడిపించుకుందామని రుణం రావడం లేదు.

- మడి రమాదేవి, రామచంద్రాపురం

కాళేశ్వరంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పరిధిలోని కాళేశ్వరంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ మహేష్, ధర్మకర్తలు కామిడి రాంరెడ్డి, అడప సమ్మయ్య, శ్యాంసుందర్, ఎంపీటీసీ రేవెల్లి మమత, సూపరింటెండెంట్ శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

వేబ్రిడ్జి కాంటా తనిఖీ



వేబ్రిడ్జి కాంటాను తనిఖీ చేస్తున్న శ్రీలత

కాటారం : మండల పరిధిలోని రేగులగూడెం పంచాయతీ పరిధిలో గల రుద్ర జిన్నింగ్ మిల్లు వేబ్రిడ్జి కాంటాను సోమవారం లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి శ్రీలత తనిఖీ చేశారు. వేబ్రిడ్జి కాంటా తూకంలో వ్యత్యాసం ఉన్నట్లు ఆరోపిస్తూ పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు శ్రీలత వేబ్రిడ్జి కాంటాను పరిశీలించారు. మిల్లులో పత్తి విక్రయించడానికి వచ్చిన రైతుల సమక్షంలో పలు రకాల వాహనాల ద్వారా తూకం వేసి వివరాలు నమోదు చేసుకున్నారు. వేబ్రిడ్జి కాంటాలో ఎలాంటి తూకం వ్యత్యాసం లేదని ఆమె తెలిపారు. పలువురు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడు రోజుల వ్యవధిలో రెండు సార్లు వేబ్రిడ్జి కాంటాను తనిఖీ చేసినా ఎలాంటి వ్యత్యాసం లేదని శ్రీలత పేర్కొన్నారు. తూకంలో మోసం చేస్తే ఊరుకునేది లేదని ఆమె మిల్లు నిర్వాహకులను హెచ్చరించారు. తూకంలో రైతులకు ఏదైనా అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎండీ.లాషరీఫ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సుపరిపాలన

పంచాయతీ రాజ్,మహిళా స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



ఏరియా ఆస్పత్రిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు సుపరిపాలన అందిస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని గట్టమ్మ సమీపంలో నిర్మించిన బాలసదనం నూతన భవనానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలో బ్రెస్ట్ మిల్క్ ఎక్స్‌ప్రెషన్ యూనిట్‌ను ప్రారంభించి మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ తరఫున లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాల్లో రెండింటిని అమలు చేశామని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పెంపొందించే విధంగా జవాబుదారీ తనంతో మెలుగుతామన్నారు. రాష్ట్రంలో ముఖ్య మంత్రిత్వ శాఖలను కేటాయించడం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు, వృద్ధుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఈ మేరకు 15 మంది చిన్నారులకు రూ.1500ల విలువ గల స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్‌తో కూడిన కిట్లు మంత్రి అందించారు. ముగ్గురు బదిరులకు వినికిడి యంత్రాలు, 4జీ స్మార్ట్ ఫోన్‌లు, దివ్యాంగులకు రెండు రెట్రో ఫిట్టెడ్ మోటర్ సైకిల్‌లు, బ్యాటరీలతో నడిచే రెండు చక్రాల కుర్చీలు, మూడు ట్రైసైకిల్‌లు, రెండు ల్యాప్‌ట్యాప్‌లను అందించారు. అనంతరం అయ్యప్ప మాలవిరమణకు వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తూ రోడ్డు ప్రమాదంలో మంగపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు మృతుల కుటుంబాలకు రూ. 50 వేలు ఆర్థిక సాయం, బాధిత మృతదేహాలను హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి వివరించారు. అనంతరం జిల్లాలోని 48 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సైన్స్ కిట్లను అందజేసిన జన్యా ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై సైన్స్ కిట్లు విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. గణిత, విజ్ఞాన శాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధికి ప్రయోగశాలలు ఉపయోగపడుతాయన్నారు. ఈ విషయంలో గణిత ఫోరం ఉపాధ్యాయుడు మధుసూదన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు రామయ్య, బాబురావు, శ్రీనివాస్‌రెడ్డి కృషికి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో జిల్లాను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతానని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ పాణిని, జన్యా ఫౌండేషన్ ప్రతినిధులు సురేంద్ర కుమార్, మిలన్, రామకృష్ణ పాల్గొన్నారు.

క్రీడా పోటీలు సమర్థవంతంగా నిర్వహించాలి



పనులను పరిశీలిస్తున్న డీడీ పోచం, అధికారులు

ఏటూరునాగారం: క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ పోచం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కొమురం భీం స్టేడియంలో క్రీడా పనులు, గ్రౌండ్ లెవలింగ్ పనులను పరిశీలించి స్పోర్ట్స్ అధికారులతో ఆయన మాట్లాడారు. రేపటి 22 వరకు నిర్వహించబోయే ఉమ్మడి వరంగల్ జిల్లా గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థుల క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయాలన్నారు. స్పోర్ట్స్ అధికారులు వారికి కేటాయించిన విభాగాలను పర్యవేక్షిస్తూ క్రీడలు విజయవంతం చేయాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, క్యారం బోర్డు, టెన్నికాయిట్, అర్చరీ, అథ్లెటిక్స్‌లో 11 అంశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారులు యాలం ఆదినారాయణ, ఆలం, శ్యామలత, వట్టం వెంకటేష్, పీఈటీ బిజ్జా, సునీత పాల్గొన్నారు.

‘పార్లమెంట్’పై కాంగ్రెస్ గురి..!

- లోక్‌సభ ఇన్‌చార్జ్‌ల నియామకం
- వరంగల్‌కు కొండా సురేఖ.. మహబూబాబాద్‌కు 'పొంగులేటి'..
- మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ బాధ్యతలు
- క్యాడర్‌తో మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు సమన్వయం
- ఆ రెండు ఎంపీ స్థానాలకు పోటాపోటీగా ఆశావహులు





మంత్రులు ధనసరి సీతక్క, సురేఖ, పొంగులేటి

సాక్షిప్రతినిధి, వరంగల్ : పార్లమెంట్ ఎన్నికలపై అధికార కాంగ్రెస్ గురి పెట్టింది. శాసనసభ ఎన్నికల్లో వరించిన విజయంతో అధికార పగ్గాలు చేజిక్కించుకున్న ఆ పార్టీ దూకుడుగా ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి వరంగల్‌పై వేగంగా పావులు కదుపుతోంది. 12 అసెంబ్లీ స్థానాలకు పదింటిలో గెలిచిన కాంగ్రెస్ వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవాలని కుతూహలపడుతోంది. అందులో భాగంగానే తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించిన ఆ పార్టీ అధిష్టానం వరంగల్, మహబూబాబాద్‌లకు సైతం నియమించింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్‌కు ఖమ్మం జిల్లాకు చెందిన రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ధనసరి సీతక్కను ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియమించింది. కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమితులైన పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ లోక్‌సభ స్థానం పరిధిలోని ఉమ్మడి వరంగల్ నియోజకవర్గాలు, మండలాల నేతలతో సమన్వయం చేయనున్నారు.

పీఏసీలో ఓరుగల్లు ప్రస్తావన..

వరంగల్, మహబూబాబాద్.. పార్లమెంట్ స్థానాలను గెలవడం కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. ఈ మేరకు సోమవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఉమ్మడి వరంగల్ మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇదే అంశాన్ని సూచించడం గమనార్హం. 12 స్థానాలకు 10 అసెంబ్లీ సీట్లను గెలిచామన్న భావనతో పార్లమెంట్ ఎన్నికలను నిర్లక్ష్యం చేయరాదని ఈ కమిటీలో సూచించినట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్ పార్టీ 131 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 28న నాగ్‌పూర్‌లో జరిగే వేడుకలకు వరంగల్, మహబూబాబాద్ నుంచి పదివేలకు తగ్గకుండా మందిని రైలుమార్గంలో తరలించాలన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పార్లమెంట్ ఎన్నికలకంటే ముందుగానే అసెంబ్లీ టికెట్లను వదులుకున్న వారిని నామినేటెడ్ పోస్టుల్లో భర్తీ చేయాలని, అందుకు సంబంధించిన ఉమ్మడి జిల్లా జాబితా కూడా సిద్ధం చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ప్రతీ కార్యకర్త అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన పట్టుదల, తెగువ, కృషి.. పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపుగా ఉండాలని సూచించింది.

పోటాపోటీగా ఆశావహులు

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు టికెట్ ఆశిస్తున్న కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల మద్దతు కూడగడుతున్నారు. మాజీ ఎంపీలు, సీనియర్లు, టీపీసీసీ, ఏఐసీసీ నేతలను సంప్రదిస్తున్నారు. వరంగల్ నుంచి దొమ్మాటి సాంబయ్య, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, కాంగ్రెస్ ఎస్సీ విభాగం చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ ప్రయత్నం చేస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిర పేరు కూడా వినిపిస్తున్నది. మహబూబాబాద్ నుంచి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్, నెహ్రూనాయక్, బెల్లయ్య నాయక్ పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నలుగురు సీనియర్లు కూడా వరంగల్, మహబూబాబాద్ కాంగ్రెస్ టికెట్ల కోసం లోపాయికారిగా మాట్లాడుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో 17 స్థానాల్లో దాదాపు 15-16 స్థానాలు కైవసం చేసుకోవాలని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం వరంగల్, మహబూబాబాద్ ఎంపీలను గెలిపించుకోవడానికి పావులు కదుపుతోంది.

బొగ్గు గనుల ఏర్పాటుకు పోరాటం



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజ్‌కుమార్

భూపాలపల్లి అర్బన్ : సింగరేణిలో ఏఐటీయూసీ ద్వారానే అనేక కార్మిక చట్టాలను చేయడం జరిగిందని, గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిస్తే నూతన గనుల ఏర్పాటుకు పోరాటాలు నిర్వహిస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఏరియాలోని కేటీకే 6వ గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఇప్పటివరకు నూతన గనులు రాకపోవడంతో రాబోయే రోజుల్లో సింగరేణి సంస్థలో పనిచేస్తున్న యువ కార్మికుల భవిష్యత్ అంధకారమే అని అన్నారు. సింగరేణిలో ప్రైవేటీకరణతో పాటు బొగ్గు గనులను కార్పొరేట్ కంపెనీలకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయని విమర్శించారు. దీంతో కార్మికుల హక్కులన్నీ హరించబడుతున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో సింగరేణి సంస్థలో బొగ్గు తీసే పని కార్మికులు చేయాలని, సొంత ఇంటి పథకం అమలు, కార్మికుల పిల్లల చదువుకు పాఠశాలలను బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, రామ్‌చందర్, రవికుమార్, చంద్రమౌళి, కృష్ణమూర్తి, వెంకటేష్, రాజన్న, సత్యనారాయణ, రాంబాబు, గణేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కవితాపఠనంలో మంజుల రికార్డు



మంజులను సన్మానిస్తున్న అతిథులు

హసన్‌పర్తి: ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో ఈనెల 16, 17వ తేదీల్లో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాల్లో హనుమకొండ మండలం గోపాల్‌పూర్‌కు చెందిన సాగంటి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, కవయిత్రీ, ఎల్‌బీ కళాశాల అధ్యాపకురాలు సాగంటి మంజుల ప్రపంచ రికార్డు సాధించారు. ఈ పోటీల్లో మంజుల 33 గంటలు ఏకధాటిగా కవితాపఠనం వినిపించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తి మండప్రతాప్, కన్వీనర్ రమావతి.. మంజులకు ప్రశంస పత్రం, మెమోంటో అందజేసి సన్మానించారు. కాగా, ఈ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1200 మంది కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. మంజులను తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్‌రెడ్డి అభినందించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



చంద్రశేఖర్ మృతదేహం


వేలేరు: విద్యుదాఘాతంతో ఓ యువకుడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మల్లికుదుర్లలో జరిగింది. ఎస్సై హరిత కథనం ప్రకారం గ్రామానికి చెందిన బస్సు చంద్రయ్య ఇంటివద్ద యూపీకి చెందిన చంద్రశేఖర్ నిషాద్(32) ఆదివారం మధ్యాహ్నం కబోర్డు వర్క్ చేస్తున్నాడు. కర్టెన్ రాడ్ బాల్కానీ పై ఉన్న 11 కేవీ లైన్‌కు తగలడంతో కరెంట్ సరాఫరా అయింది. ఇది గమనించని చంద్రశేఖర్ రాడ్‌ను కిందికి తీస్తున్న క్రమంలో కరెంట్ షాక్ తగిలి అపస్మరకస్థితికి చేరుకున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత సోమవారం తెలిపారు.

పంట పరిరక్షణకు..

నారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



వర్ధన్నపేటలో యాసంగికి సిద్ధమవుతున్న నారు



- మెళకువలతో అధిక దిగుబడి
- విత్తన శుద్ధితో తెగుళ్ల నివారణ

వర్ధన్నపేట: ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభమైంది. దీంతో అన్నదాతలు దుక్కులు దున్నుతూ వరి నారు పోసుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో నారుమడిలో యాజమాన్య పద్ధతులు, విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి రాంనర్సయ్య వివరించారు.

విత్తన శుద్ధి

నారు పోసే ముందు విత్తన శుద్ధి చేయాలి. తద్వారా పంటకు పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించవు. కిలో విత్తనాలకు 2.5 గ్రాముల కార్బండైజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. లేదా కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముల్వ పురుగు ఆశించకుండా ఉంటుంది.

నారుమడి తయారీ విధానం

నారు పోయాల్సిన మడిని దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పారించడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి. ఎకర పొలం నాటడానికి అరగుంట భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి. అరగుంట నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

నారులో కలుపు నివారణ

నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 మిలీ, ఒక లీటర్ నీటిలో కలిపి విత్తిన 7 లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారీ చేయాలి. విత్తిన 15 రోజులకు సైహాలోపాస్ బ్యూటైల్ 10 శాతం మందును 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన పది రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు అరగుంట నారుమడికి 150 గ్రాముల చొప్పున చల్లాలి. లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ మందును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ ఫాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. నారు 20.25 రోజుల వయసు ఉన్నప్పుడు 4 నుంచి 6 ఆకుల దశలో నాటుకోవడం వల్ల దిగుబడి అధికంగా వస్తుంది.

నాటు వేసే విధానం

నారు ఆకు లేతగా ఉంటేనే చేను తొందరగా తిరుగబెడుతుంది. 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు వాడితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంటుంది. నాట్లు వేసేటప్పుడు భూసారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటరుకు 44 నారు మొలకలు ఉండేలా నాటుకోవాలి.

చలి నుంచి నారుమడికి రక్షణ చర్యలు..

చలి ప్రభావం నుంచి నారు మడుల్లో ఎదగకపోవడం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతో పాటు అందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- సాయంత్రం వేళలో నీరు తీసి పగటి పూట వెచ్చటి నీరు పారించాలి.
- రోజు సాయంత్రం అడుగు ఎత్తులో వెదురు చెక్కలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.
- జింక్ లోపం వల్ల ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ప్రజా పరిపాలన అందిస్తా..



ప్రశాద్ ప్రాజెక్టు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

- ప్రశాద్ ప్రాజెక్టు పనులు నాణ్యతతో చేపట్టాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలు తనకు తెలుసు.. వాటి పరిష్కారానికి చొరవ తీసుకుని ప్రజా పరిపాలన అందిస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. సోమవారం రామప్ప దేవాలయాన్ని సందర్శించిన ఆమెకు ఆలయ ఈఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మంత్రిని అర్చకులు సత్కరించి ఆశీర్వదించారు. ఆనంతరం ఆమె ఆలయ తూర్పు ముఖద్వారం వైపున రూ.62 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రశాద్ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ, ఐటీడీఏ పీఓ అంకిత్ ఆధ్వర్యంలో టీఎస్‌టీడీసీ ఏఈ విజయ్‌కు మార్ మ్యాప్ ద్వారా సీతక్కకు వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పర్యాటకుల సౌకర్యార్థం చేపడుతున్న ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను జూన్‌లోగా నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానని, రామప్ప ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని తెలిపారు. మంత్రి రామప్ప నుంచి ములుగు వెళ్లే క్రమంలో మైనార్టీ హాస్టల్ విద్యార్థులు లక్ష్మీపురం వద్ద సీతక్కను కలిసేందుకు రోడ్డుపై నిలబడగా వాహనం దిగి వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు మంత్రితో సెల్ఫీలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీతక్క కుమారుడు ధనసరి సూర్య, పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు చెన్నోజు సుర్యనారాయణ, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, జంగిలి రవి, చింతనిప్పుల భిక్షపతి, మహిపాల్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, మామిడిశెట్టి ధర్మతేజ, చెన్నోజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫోన్ పోయిందంటే.. డబ్బులు మాయం

- యూపీఐ వ్యాలెట్ల నుంచి నగదు కాజేస్తున్న సైబర్ నేరగాళ్లు
- సిమ్ వేసుకుని బ్యాలెన్స్ చూసేసరికి డబ్బులు గోవిందా

కాజీపేట: మొబైల్ ఫోన్ పోయిందంటే చాలు.. యూపీఐ వ్యాలెట్ల నుంచి సైబర్ నేరగాళ్లు నగదు కాజేస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. కాజీపేటకు చెందిన ఓ రైల్వే ఉద్యోగి ఫోన్ ఇటీవల చోరీకి గురైంది. మరుసటి రోజు కొత్తఫోన్ తీసుకుని పాత నంబర్‌తో ఉండే సిమ్ వేసి చూశాక బ్యాంకు ఖాతాలోని దాదాపు రూ.95వేలు మాయమయ్యాయి. దీనిపై లావాదేవీలు చూడగా యూపీఐ వ్యాలెట్ ద్వారా డబ్బు బదలాయించుకున్నట్లు తేలింది. ఖరీదైన స్మార్ట్ ఫోన్లు పోతే ఇలా కొత్త సమస్య వచ్చి పడినట్లేనని బహిర్గతమైంది. గూగుల్, ఫోన్‌పే నుంచి డబ్బు మాయం చేస్తున్నారు. బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ రహస్య కోడ్ వంటివి ఫోన్‌లో కాంటాక్టు లిస్టు ఇతర రూపాల్లో భద్రపరచుకున్న వారే ఎక్కువగా ఇలాంటి మోసాల బారిన పడుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

కొట్టేసిన డబ్బులతో షాపింగ్..

సాధారణంగా ఫోన్లు పోయి కొత్తది కొని పాత నంబర్ యాక్టివేషన్ చేయించేలోపు సైబర్ నేరస్తులు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఎక్కువ మంది బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ పిన్ వంటివి కాంటాక్టు లిస్టులో సేవ్ చేసుకోవడంతో నేరగాళ్ల పని మరింత సులువవుతుంది. మరికొందరు యూపీఐ కోడ్‌గా వరుస నంబర్లు, పుట్టిన సంవత్సరం, వాహన రిజిస్ట్రేషన్ నంబర్లు పెట్టుకుంటున్నారు. దీంతో సులువుగా ఛేదించి డబ్బు ఇతర ఖాతాలకు బదలాయించుకుంటున్నారు. కొందరు పెట్రోల్ బంకులు, షాపింగ్ మాల్స్‌లో స్కాన్ చేస్తున్నారు. ఫోన్లు కొట్టేశాక సైబర్ నేరగాళ్ల సిమ్ కార్డులతోనూ డబ్బు కొట్టేస్తున్నారు. కొట్టేసిన ఫోన్ నంబర్ ఏ బ్యాంకు ఖాతాతో లింకు అయిందో తెలుసుకుని ఫోన్లో దాచుకున్న బ్యాంకు ఖాతా, యూజర్ ఐడీ సేకరించి తేలికగా డబ్బులు కొటేస్తున్నారు.

బ్లాక్ చేయండిలా..

- గూగుల్ పే వినియోగదారులు 18004190157 ద్వారా బ్లాక్ చేయాలి.
- ఫోన్ పే వినియోగదారులు 08068727374 ద్వారా బ్లాక్ చేయాలి.
- పేటీఎం వినియోగదారులు 01204456456 ద్వారా బ్లాక్ చేయాలి.

అప్రమత్తంగా ఉండాలి...



ఫోన్ పోయిన వెంటనే యూపీఐ, డబ్బు లావాదేవీలు నిర్వహించే యాప్‌ల నుంచి లాగవుట్ అవ్వాలి. యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే పాస్‌వర్డ్‌ను కాంటాక్ట్ లిస్టులో సేవ్ చేసుకోకూడదు. ఒకవేళ యాప్‌ల నుంచి డబ్బులు బదిలీ చేసుకున్నట్లు గుర్తిస్తే వీలైనంత తొందరగా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

– సార్ల రాజు, సీఐ కాజీపేట

నెక్ వరంగల్ జోనల్ చైర్మన్‌గా ప్రదీప్‌రావు



నెక్ వరంగల్ జోనల్ నూతన కమిటీ

కాజీపేట అర్బన్: నెక్ వరంగల్ జోనల్ చైర్మన్‌గా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు 6వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని బీవీ రావు భవన్, నెక్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిటీని (ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలు) ఎన్నుకున్నారు. ఇందులో జోనల్ చైర్మన్‌గా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వైస్ చైర్మన్‌గా ఎం.నిశాంత్‌కుమార్, కోశాధికారిగా పరుచూరి కిరణ్‌కుమార్, మెంబర్లుగా త్రిపురనేని సుబ్రహ్మణ్యం, బొబ్బాల శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కాగా, తనపై నమ్మకంతో ఆరోసారి కూడా తనను జోనల్ చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు సభ్యులకు ప్రదీప్‌రావు ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా వరంగల్ లోకల్ చైర్మన్‌గా ఆవుల చంద్రయ్య, వైస్ చైర్మన్‌గా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా కే.రాజేశ్వర్‌రావు, మెంబర్లుగా ప్రతాప్‌రెడ్డి, నిశాంత్ ఎన్నుకున్నారు. మార్తినేని ధర్మారావు, శ్యాంసుందర్‌రావు, రామారావు, మార్త రాంప్రసాద్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయ హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

- ప్రతీ ఇంట్లో క్షుణ్ణంగా తనిఖీ..
- రహమత్ నగర్ కాలనీలో పోలీసుల విస్తృత సోదాలు

కాజీపేట: కాజీపేట పట్టణం 61వ డివిజన్ రహమత్ నగర్ కాలనీలో దారుణ హత్యకు గురైన కన్నె విజయ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. సోమవారం సీఐ సార్ల రాజు తన సిబ్బందితో కలిసి కాలనీలోని పలు ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కాలనీకి సంబంధించిన వ్యక్తులే వృద్ధురాలిని హత్య చేసి ఉంటారనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రతీ ఇంట్లో విస్తృత సోదాలు చేశారు.

సాక్ష్యాధారాలు లభించకుండా నిందితుల జాగ్రత్తలు..

కర్రతో తలపై బలంగా కొట్టి హతమార్చిన నిందితులు పోలీసులకు ఎలాంటి సాక్ష్యాధారాలు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. మృతురాలి శరీరంతో పాటు దుస్తులను సబ్బు నీళ్లతో కడిగి ఎలాంటి రక్తపు మరకలు లభించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిందితులకు ఎంతో ధైర్యం ఉంటే తప్ప ఈ దుశ్చర్య సాధ్యం కాదని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు. నిందితులు ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలకు కూడా చిక్కకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో ఆధారం లభించక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు.

కుటుంబీకులపై అనుమానం..

పోలీసులు మూడు రోజులుగా కాలనీలోనే మకాం వేసి విజయ హత్య కేసులో దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా బయటి వ్యక్తులతోపాటు కుటుంబీకుల ప్రవర్తనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. కుటుంబంలో వృద్ధురాలికి ఎవరితో నైనా అంతర్గత గొడవలు ఉన్నాయా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. కుటుంబీకుల సెల్‌ఫోన్ కాల్ లిస్ట్ సేకరించి..వృద్ధురాలు మృతి చెందిన అనంతరం ఎవరెవరితో మాట్లాడారు? వారు ఎవరు అనే విషయాలను ఆరా తీస్తున్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు



అండర్-14 కేటగిరీలో తలపడుతున్న క్రీడాకారులు

హన్మకొండ: పాఠశాల క్రీడల సమాఖ్య అండర్-14, 17 బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు సోమవారం హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో ఉత్సాహంగా కొనసాగాయి. సుమారు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. నిర్వాహకులు బరువును తీసుకుని ఎంపిక పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 19న మంగళవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో పాల్గొంటారని ఎస్‌జీఎఫ్ బాధ్యులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■KUDA, GWMC అప్రూవ్‌డ్ రెసిడెన్షియల్ ప్లాట్లు చింతగట్టు క్యాంప్ వద్ద తక్కువ ధరలో అమ్మబడును. గజం: 15000/- మాత్రమే. సంప్ర॥ సంగీత - 9866943026. [W-1229340]

HOUSE FOR SALE

■వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-788969]

SERVICES

■వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా దరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788966]

BUSINESS OFFER

■ఉ॥ 6 గంటల నుండి మ॥ 12 గం॥ వరకు బైక్ ద్వారా గ్రామాల్లో తిరిగి శ్రీ విజయలక్ష్మీ వెజ్ & నాన్ వెజ్ పచ్చళ్లు అమ్మటం ద్వారా నెలకు 30 వేలు ఆపైన ఆదాయం వస్తుంది. బైక్ తప్పనిసరి. 8143909459. [W-1229341]

WANTED

■ Wanted door to door Marketing persons Male / Female No age or Education limit Freshers can apply. Cont: 7997777377. [W-788970]

■ హన్మకొండ, వరంగల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (స్త్రీ/పు॥ సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. 8 గం॥ 12 గం॥ డ్యూటీలు కలవు. సాలరీ: 12000-16000. సంప్ర॥ 8688072125. [W-1220881]

■ Wanted Male Councillor for our overseas consultancy (Experience candidate will be preferred with attractive salary) Cont: 8106349938, 9849248509. [WA-13685]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్/ఫుల్ టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-824667]

■ హన్మకొండలోని మా ఇంట్లో ఇంటి పని, వంట పని పనిచేయుటకు వంట మనుషులు భార్యభర్తలు /వంట మాస్టర్ పురుషులు కావలెను సంప్ర॥ సెల్: 9866012888. [W-1229334]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221891]

■ అల్వాల్‌లో చిన్న కుటుంబం కొరకు ఇంటి పని వంట పని చేయుటకు నమ్మకమైన ఆడ మనిషి కావలెను. భోజనం. 9100023171 [HA-95868]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

క్రీస్తు జననం ప్రపంచానికి పండుగ

- ఓరుగల్లు పీఠాధిపతి బిషప్ ఉడుములబాల



దివ్యాంగ పిల్లల మధ్య కేక్ కట్‌చేస్తున్న బిషప్ ఉడుముల బాల, ఇన్నారెడ్డి, విజయపాల్

కాజీపేట రూరల్ : ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి పండుగ రోజు అని ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ ఉడుముల బాల అన్నారు. ఫాతిమానగర్‌లోని లోడి సాంఘిక సేవా సంస్థలో సోమవారం దివ్యాంగుల మధ్య ప్రీ క్రిస్మస్ సంబురాలు జరగాయి. ఈ వేడుకల్లో ఉడుముల బాల మాట్లాడుతూ దివ్యాంగ, హెచ్‌ఐవీ పిల్లల మధ్య క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. పిల్లలకు క్రీస్తు దీవెనలు, ఆశీస్సులు ఎప్పటికీ ఉండాలని దీవించారు. లోడి సంస్థ డైరెక్టర్ ఫాదర్ ఇన్నారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగ, హెచ్‌ఐవీ పిల్లల ఆరోగ్యం, చదువుపై అన్ని విషయాల్లో అండగా ఉండి వారి అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఫాదర్ డి.విజయపాల్‌రెడ్డి, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ చైర్మన్ మండల పరుశరాములు మాట్లాడుతూ లోడి సేవా సంస్థ దివ్యాంగ, హెచ్‌ఐవీ పిల్లలకు చేస్తున్న సేవలు ఆదర్శనీయమన్నారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం 600 మంది దివ్యాంగ పిల్లలకు కొత్త దుస్తులు, 150 మంది హెచ్‌ఐవీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోడి సంస్థ నుంచి సిస్టర్ ధనియా, బాలశౌరి, కె.నాగేశ్వర్‌రావు, కె.మల్లేష్, పి.శౌరెడ్డి, ఎల్.వీరబాబు, బాజీ, డి.సామ్యూల్, టి.జయకిరణ్, జి.జోష్న, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు
- టేకులగూడెం క్రాస్ వద్ద ఘటన

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. మడికొండ పోలీసుల కథనం ప్రకారం హసన్‌పర్తి మండలం దేవన్నపేటకు చెందిన ఆటో డ్రైవర్ కొలుగురి చందర్ (28), అతడి స్నేహితుడు మహేందర్ ద్విచక్రవాహనంపై జనగామ నుంచి దేవన్నపేటకు వస్తున్నారు. ఈక్రమంలో టేకులగూడెం క్రాస్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో చందర్ అక్కడికక్కడే మృతి చెందగా మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో మహేందర్‌ను ఎంజీఎంకు తరలించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. అనంతరం మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరకాల శివారులో మరో యువకుడు..

పరకాల: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన పరకాల పట్టణ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పరకాల మండలం నాగారం గ్రామానికి చెందిన కంచ కృష్ణ(25) ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై పరకాల నుంచి నాగారం వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల పట్టణ శివారు నాగారం రోడ్డు కొత్త గుడిసెల కాలనీ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో తీవ్ర గాయాలపాలైన కృష్ణను బంధువులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పరకాల సీఐ వెంకటరత్నం సోమవారం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

బయ్యారం: వ్యవసాయానికి పెట్టిన పెట్టుబడులు రాక ఆర్థిక ఇబ్బందులకు గురై ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జగత్‌రావుపేట శివారు రెడ్యాతండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సునావత్ బిచ్యా(47) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో పంట దిగుబడి సరిగారాక అప్పులు పెరిగాయి. దీంతో ఆవేదనకు గురైన బిచ్యా ఆదివారం రాత్రి గడ్డి నివారణ మందుతాగగా కుటుంబీకులు మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్ట్



నర్సింహ అరెస్టు చూపుతున్న ఏసీపీ రఘుచందర్, సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్

పాలకుర్తి టౌన్: మండలంలోని శిరసన్నగూడెం గ్రామానికి చెందిన గాయాల వెంకటయ్యను హత్య చేసిన ఆయన కుమారుడు నర్సింహను అరెస్ట్ చేసినట్లు వర్ధన్నపేట ఏసీపీ డి. రఘుచందర్ తెలిపారు. ఈ మేరకు ఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం ఏసీపీ విలేకరులకు వెల్లడించారు. వెంకటయ్యకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ముగ్గురు కూతుళ్లకు పంచిన భూమి విషయంలో ఈ నెల 17న వెంకటయ్య, నర్సింహకు మధ్య గొడవ జరిగింది. ఆగ్రహానికి గురైన నర్సింహ కర్రతో వెంకటయ్యను తలపై బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన వెంకటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై వెంకటయ్య కూతురు తాళ్లపెల్లి రాధిక ఫిర్యాదు మేరకు సీఐ విశ్వేశ్వర్, ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో విచారణ జరిపి నిందితుడు నర్సింహను అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీపీ తెలిపారు.

లైంగికదాడి కేసులో వ్యక్తి ..



కేదారి అరెస్ట్ చూపుతున్న రూరల్ సీఐ కిషన్

నల్లబెల్లి: మతిస్థిమితం లేని మహిళపై లైంగికదాడికి పాల్పడిన కామంధుడిని అరెస్టు చేసినట్లు నర్సంపేట రూరల్ సీఐ పుల్యాల కిషన్ తెలిపారు. ఈ మేరకు నల్లబెల్లి పీఎస్‌లో ఎస్సై నైనాల నగేష్‌తో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 15వ తేదీన మండలంలోని దస్తగిరిపల్లిలో మతిస్థిమితం లేని ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన కడివెండి కేదారి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి కేదారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, శ్యాం పాల్గొన్నారు.

మేడారంలో విద్యుత్ పనులు షురూ



కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర సందర్భంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర జరగనుంది. జాతర సమయం రెండు నెలలే ఉండడంతో ప్రభుత్వం ఇటీవలే జాతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. మంత్రి సీతక్క రెండుసార్లు జాతర ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు మేడారంలో పనుల ఏర్పాట్లు మొదలుపెట్టారు. జాతరలో నాలుగు రోజులు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు మేడారంలోని పాత సబ్‌స్టేషన్ పరిధిలో పీటీఆర్ సామర్థ్యాన్ని పెంచారు. మేడారం (సమ్మక్క సారలమ్మ) సబ్ స్టేషన్ పరిధిలో కూడా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచే ఏర్పాట్లు చేస్తున్నారు. 33 కేవీ విద్యుత్‌లైన్ పనులు, కొత్త స్తంభాల ఏర్పాట్లు చేపట్టారు. మేడారం జాతర ప్రదేశాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి కరెంట్ లైన్‌కు కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈసారి జాతరలో విద్యుత్‌శాఖ పనులు అన్ని శాఖల కంటే ముందుగా మొదలయ్యాయి. ట్రాన్స్‌కో డీఈ పులసం నాగేశ్వర్‌రావు పర్యవేక్షణలో ఏఈ వేణుకుమార్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.